# వేశ్యావృత్తి

శ్రీ ఎచ్చెర్ల జయప్రసాదరావు

కాంతానికప్పుడు పదిహేడో ఏడు. యింత చిన్నతనంలోనే, అన్ని పాపాలు అనుభవిస్తుంది. అమాయికురాలు. పెంపుడు తల్లికి వ్యతిరేకముగా నడవలేక, వ్యభిచారంలో దిగింది. సగం మనస్సుతో నిత్యం పడుతున్న బాధ సహించలేక, మనుస్సువిసిగి, మద్రాసులో, చదువుచున్న మేనత్తకొడుక్కి జాబు వ్రాసి ఆతనిరాకకై నిరీక్షిస్తుంది.

యింతలో లోనుండి రామారావుగారు వచ్చేరని కేక వినబడింది. కాంతం గుండెల్లో రాయి బడినట్లయింది. పైట సవరించింది.

"కాంతం! కాంతం! యింతేనా!"......అని ప్రవేశించారు రామారావుగారు.

"కాంతం! ఎంతసేపయిందొచ్చి తెల్సా? చూడు—ఇల్లా నా కళ్లల్లోకి చూడు......"

కాంతం మాట్లాడలేదు.

"ఏం? మాట్లాడవేం?"...పిడుగుపడినట్టు గర్జించారు. రామారావుగారు.

అంతవరకూ ఆయాసముతో నిండిన గుండెలు గతుక్కుమన్నవి. గజ గజ వణికిపోయింది కాంతం.

రామారావు నిజంగా రౌడీ రామారావే...కిర్రు చెప్పులు, గ్లాస్కోమల్లు లాల్చి, గ్లాస్కోమల్లు పంచ, గోల్డుఫ్లేకు సిగరెట్టుకాలుస్తూ సానివీధిని బడి పోతూంటే, గుమ్మములోనుండి, గిరుక్కున లోనకు బోయేవారు సానులందరు. ఆయనంటే ఆవీధి హడల్!...

"మాట్లాడవేం? మొద్దులాగ!......నిన్నే అడిగేది!"......

నిరాధారియైన కాంతాన్ని రామారావు పలుకులు, గడ గడ లాడించినవి. ఒకప్రక్కనుండి చెమటలు గ్రక్కుచు, "బాబూ!...మన్నించాలి. యి...క...యీ...వృ...త్తి...[illegible]...స...ర్జి...o...చా...ను..."అంతవరకూ కొండంత ఆశతో ఉన్న రామారావుగారి కోర్కెలు అడుగంటాయి. కర్కశంగా కనకమ్మా! కనకమ్మా! అని పిలిచేరు.

కనకమ్మ "బాబయ్యా! పొట్టకూటికి కష్టపడే నేను, ఎంతచెప్పినా వినక, పెండ్లి అని పలవరిస్తుంది. పెద్దవారు, తమరే యోచించా"లన్నది కొంచమైననూ కనికరములేక.

కాంతం "ప్రపంచములో పడుప్రవృత్తి నీచం. ప్రతీవారు వీళ్లమీద పవరు చలాయిస్తారు. నిష్కారణముగా, నిరాధారులపై......సాని సర్వ హక్కులికి లొంగి ఉండాలన్న శాస్త్రమా?

"అయినా ఆడపిల్ల నింత హద్దుమీరనివ్వరాదు. ఆడపడుచులు అవివాహితులై యింటబడియున్న పదిరాళ్లు సంపాదించొచ్చు. మీ యిద్దరిపొట్టకి చాలదా?"అని సవాలుకొట్టేరు రామారావుగారు.

కాంతం "ఆ పొట్టకూటికోసమా!...వద్దు. వెధవ వ్య...భి...చా...రం! ఏపాపి పునరుద్ధించింది యీ వ్యభిచారం? ఆ పాపి కనబడితే రక్తం పీల్చి పిప్పిచేస్తా!..."

"మానము చీల్చివేస్తున్న యీ వ్యభిచారం."

"హిందూధర్మమునకు వ్యతిరేకమగు యీ వ్యభిచారం వనితాలోకమునకు దుష్కళంకమగు యీ వ్యభిచారం హృదయంలో ప్రవేశించి దహించేస్తున్నదే! హే! అనాధరక్షకా! నా జన్మసాఫల్యతకు మార్గములేదా?"...........

"యింతటితో యీ ఆడుబొంది అంతరించుటకు ఆజ్ఞ యియ్యవా?......అబ్బా! నేను...వినలేను, ఈ బాధ భరించలేను!" అంతవరకూ అధైర్యమొందిన కాంతం లేనిధైర్యం తెచ్చుకుంది.

"బాబూ! మీ...భా...ర్య...లు!...మీ...త...ల్లు...లు...మీ...చెల్లెళ్లు!...ఆడ...పుట్టువు గాదా? అనాధనగు నన్నిటులు అవమానపర్చుట, న్యాయమా? ధర్మమా?"...

దిగ్గున లేచేరు రామారావుగారు.

'కాంతం.'

'అత్తా! అత్తా! కాంతం ఎక్కడ?' అంటూ ప్రవేశించాడు ప్రతాపు.

'బావా! ఎన్నాళ్ళకి నీ దర్శనం? కుశలమేనా?' అని నవ్వుతూ కాంతం అడిగింది.

కాంతం అన్న మాటలు రామారావుగార్కి ఒక పెద్ద ఫిరంగిదెబ్బలాగు తగిలాయి. మనుస్సు తన స్వాధీనం తప్పింది. మనస్సులో కెరటాలు పరుగెత్తుతున్నాయి. యింత పెద్ద రౌడీ మూడు ముక్కలతో నిలువునా నీరైనాడు. అతి కష్టంమీద, వణికిపోయే కంఠంతో 'కాంతం! వెడతాను' అని "ఆదరణపూర్వకంగా" అని బయటపడ్డాడు.

తెల్లవారింది. యింట్లో కాంతం ప్రతాపులు కనబడలేదు. కన్న ప్రేమకన్న, పెంచినప్రేమ పెద్దది. ఎంతో శ్రమపడి పెంచిన కనకమ్మ కండ్లనిండ నీరు నించింది., ఎన్నో ఆలోచనలు తోట్టాయి.

కాలచక్రం శ్రీఘ్రగతిన తిరుగుతూంది.

"కష్టసుఖాలు కాపురముండవు. ప్రపంచములో కొంతవరకు సుఖము, కొంతవరకు దుఃఖము, సహజమయిన విషయాలు. నేడు దుఃఖించినది నీవెగాదు. నలభైకోట్ల హిందూ, ముసల్మానులు యీ దురాచారమగు పూర్వాచారమును బాపుటకు కంకణము కట్టేరు"అని ప్రతాపు మద్రాసులో ఒక అద్దె యింటి హాలులో కూర్చొని కాంతంతో ముచ్చటించాడు.

అందులో, "మీరొక్కరే అన్నది అన్నట్టుగనే, అదురులేక జరిపారు" అన్నది కాంతం. దానితో యిద్దరు విరగబడి నవ్వుకున్నారు. [ఆవిధంగా రోజులు గడిచిన కొద్దీ, అదృష్టవశాత్తూ ఒక ఆఫీసులో గుమస్తాగా చేరాడు ప్రతాపు, ఏభైరూపాయిలకు కొద్దిగా చదువు, సంగీతజ్ఞానం వున్నందువల్ల అనాధఆశ్రమ వార్డన్‌గా ప్రవేశించింది కాంతం.]

మూలనున్న గడియారం ఠంగ్ ఠంగ్ మని ఎనిమిది కొట్టింది.

"కాంతం! ఎనిమిదయింది. ఆఫీసుకి వెళ్లాలి" అన్నాడు ప్రతాపు.

"అంతేనా! నాక్కూడా ఆశ్రమానికి టైమయింది. యిద్దరం ట్రాములో పోదామా?"
"చాల్లెద్దురూ! ఏమిటమ్మా! ఎప్పుడున్నూ! అసహ్యంగా. మీ కసలు కనబడితే ఒట్టు" అంది కాంతం.

"వెర్రిదానా! సాయంత్రంవరకూ నేను కనబడితే ఒట్టు"

"మీరు నాకు కనబడరు. నేను మీకు కనబడను."

"దానికి ఒట్టెందుకూ?"

ఫక్కాలున నవ్వారు యిద్దరు. వీధితలుపు అప్పుడే తెరువబడ్డది.

కాంతం ఒళ్లు ఝల్లుమంది. పిడుగుదెబ్బకి భయపడినట్లు ఉలిక్కిపడి చూస్తుంది. కుడిచేతిలో కమండలం, ఎడమచేతిలో రుద్రాక్షమాల, కాషాయి వస్త్రధారిణి ప్రవేశించి, "చేసినపాపములకు ఫలితమే కలిగెన్. ఆహా! ఏదీ! నా భాగ్యము. స్వామి కనిపించెన్!......అమ్మా! పట్టెడన్నము పెట్టగలరా తల్లీ! అమ్మా! మీ రెవరు? ఆశ్చర్యంతో అడిగింది కాంతం. శుష్కించిపోయిన శరీరముతో 'నా చరిత్ర అడిగేవారు ఎవరమ్మా!......' యింకా! నన్ను క...ని...క...రించే...వారు. యీ ప్రపంచములో ఎవరన్నా ఉన్నారా? పా...పి...ని...! ఛం...ఢా...లి...ని.,.!"

ప్రతాపు నిశ్చేష్టుడై నిలబడ్డాడు. "అమ్మా! నిన్ను చూస్తుంటే మా అమ్మ జ్ఞాపకం వస్తుంది. నీ కెందుకూ యింత యెర్రనెండలో భిక్ష ఎత్తడం? నీకెవ్వరూ లేరా?" అంది కాంతం.

అడిగినమాటకి వెంటనే జబాబు చెప్పలేకపోయింది. "లేకేమి! తల్లీ! ఒకే ఒక్కకూతురు. దాన్ని కష్టతరమైన కార్యములోకి దింపాను. నా శీలం కాపాడుకోవటం నా విధి అని, తన అయిష్టం తెల్పి పరారయింది. ఆరోజు మొదలు అదే విచారంవల్ల కృశించిపోతూ, ఆ పాపఫలితముకు యీ శరీరమును మోసుకుంటూ భగవన్నామస్మరణలో తీర్థయాత్రలుకి బయిల్దేరి యీనాటికి మద్రాసు చేరేను."

ముఖాన్నున్న స్వేద బిందువులు తుడుచుకుంటూ "మీ పేరేమి?" అన్నది కాంతం, దడ దడ కొట్టుకొనే గుండెల్తో!

"నా పేరా? నా...పే...రా... తల్లి! కనకమ్మ."

"అమ్మా!" అని కౌగిలించుకుంది కాంతం.

పది గజాల దూరములో నిశ్చేష్టుడై నిల్చున్న ప్రతాపు "అత్తా!" అని పిచ్చికేక వేశాడు. సాయంత్రం సూర్యుడు తన కాంతిని గోలుపోతూ పశ్చిమ దిక్కు పట్టి పోతున్నాడు. ఆ సమయంలో కాంతం ప్రసాదుడైన ప్రతాపు ప్రతిమను చూస్తూ ముగ్ధురాలైంది. తనకు ప్రతాపుని మించిన వారెవ్వరున్నారు, లోకంలో? ఇద్దరు కలసి సంఘసేవకై జీవితము లర్పింప నిశ్చయించుకున్నారు